"వెళ్ళిపోవాలండీ! చాలా అర్జంటు!" మెట్లు దూకేశారు.

"పోనీ మళ్ళీ రేపురండి!" కవిగారి ఆహ్వానం దీనంగా.

కుర్రాళ్ళెలా మాయమయ్యారో కనపళ్ళేదు.

కుర్రాళ్ళిద్దరూ ఆశ్చర్యాలు వెలిబుచ్చుకోడానికి రోడ్డు మధ్య ఆగిపోయారు.

"కవిగారు కూడా భార్యని అలా పిల్చారేవిట్రా? 'ఒసే'నా! 'ఏమే'నా! మరి పద్యాల్లో, 'సుందరీ, ప్రేయసీ' అని పిల్చినట్టు రాస్తా రుగా?"

"పద్యాల్రా అవీ! నిజంలో అలా పిలవరుగా? కవిగార్రైనా ఇంట్లో అంతేనన్న మాట!"

"సుందరి మీద కవిగారు అంత అందంగా పద్యాలు రాస్తారు గదా? అక్కయ్యగారు అలా వున్నారేవిట్రా?"

"పాపం కవిగారు పేదవారు రా! దానికి ఆయనేం చేస్తారు?"

"అవుననుకో. మరి... పేదతనంగా బతుకు తున్నారు కదా? పేదతనం మీదే, కష్టాలమీదే పద్యాలు రాయకూడదూ? అలాగే రాయాల్రా! స్వర్గాలూ, దేవ లోకాలూ, అప్సరసలూ, అమృతాలూ... అలాంటివి ఎందుకురా? అవన్నీ ఎక్కడు న్నాయి?"

"కాయితాల మీదే! కవిగారి ఇంట్లో లేవు. కవిగారి జీవితంలో లేవు."

"అయ్యయ్యో! 'ఇలాంటివి ఎందుకు రాస్తున్నారు కవిగారూ' అని మనం అడగవలసిందిరా!"

"అసలు భార్యని 'ఒసే' అని ఎందుకు పిల్చారో, ఆ ఒక్కమాటన్నా అడగవల్సిందిరా!"

"అయితే, రేపు మళ్ళీ వెళ్దాం."

"నా కేవిటో గాభరాగా ఉందిరా! ఏదైనా సినిమాకి పోదాం! కాస్సేపు సరదాగా వుంటుంది."

"నా కెందుకో తల తిప్పుతోంది, విఠలాచార్య పిక్చర్కే పోదాం!"

సోడాలు తాగి, తీరిగ్గా సినిమాహాల్లో కూచున్నాక, కుర్రాళ్ళ మొహాల మీదకి కొంచెం కళ వచ్చింది.

ఉన్నట్టుండి ఇద్దరూ హఠాత్తుగా ఒకరితో ఒకరనుకున్నారు — "హోరినీ! కవిగారూ మామ్మూలు వాళ్ళేరా! అందర్లాంటి వాళ్ళేరా!"

["ప్రగతి" వారపత్రికలో. 1970 కన్నా ముందు కావచ్చు] ★

# కమల

కమల మొదటిసారి అత్తగారింటికొచ్చి అప్పటికి పదిరోజులైంది. ఆ పదిరోజులూ ఇక్కడ పుల్లతీసి అక్కడ పెట్టవలసిన పని లేకుండా అంతా అత్తగారే చేసుకుపోతోంది.

కొత్త కోడలికి రోజంతా విశ్రాంతే. రెండు పూటలా కొత్తచీరలూ, ముస్తాబులూ, అత్తగారందించే టిఫెన్లు తినడం, పత్రికలు చదువుకోడం, అలా జరిగి పోయింది.

ఆ పూట కమలకి కళ్ళు చెమర్చినంత బాధ కలి గింది. ఎన్నడూ ఒక్కమాట అనని అత్తగారు కోపంగా మాట్లాడింది.

అన్నదంటే అనదా? తప్పంతా తనదే! మరీ బుద్ధిలేకండా చేసింది.

మధ్యాన్నం ఆడ బిడ్డ స్కూలునించి వచ్చి తల్లి కోసం వెతుక్కుంది. ఆవిడ నిద్రపోతోంటే, ఆ పిల్ల కమల దగ్గిరికి వచ్చి "వదినా! అన్నం పెడతావా?" అంది.

వార పత్రికలో మునిగిపోయిన కమల కొంచెం తలతిప్పి చూసి "మీ అమ్మ పెడుతుందిగా?" అంది.

"అమ్మ నిద్రపోతోంది."

"వస్తాలే, కాస్సేపు ఆగు."

"మళ్ళీ బడికి వెళ్ళాలి వదినా తొందరగా."

"నువ్వే పెట్టుకోరాదూ, అన్నీ అక్కడే వుంటా యిగా? అన్నం కూడా పెట్టుకో లేవా?"

ఆ అమ్మాయి మాట్లాడకుండా వెళ్ళిపోయింది. తనే పెట్టుకుంటుందేమో అనుకుంది కమల.

తీరా అత్తగారి కంఠం వినపడితే కంగారు పుట్టింది. గబగబా లేచి వెళ్ళింది.

"చిన్నపిల్ల ఎండలోపడి వచ్చి అన్నం పెట్టమంటే, నువ్వేపెట్టుకో అంటావా?" అంది అత్తగారు కొంచెం మెత్తగానే. కానీ ఆవిడ కంఠం కోపంగానే వుంది.

కమల సిగ్గుపడిపోయింది. మాట్లాడ లేక పోయింది.

అత్తగారు మళ్ళీ "ఎక్కడేం వుందో చూసి పెట్టు కోడం దానికి తెలీదమ్మా! ఎప్పుడూ నేనే పెడతాను. దానికోసం చూస్తూనే వున్నాను. నిద్రపట్టేసింది" అంది.

కమల నోరెత్తలేకపోయింది. "నేను చూస్తాను. మీరు వెళ్ళిపడుకోండి" అనాలని కూడా తోచలేదు. నెమ్మదిగా గదిలోకి వచ్చేసింది.

నిన్న మొన్నటిదాకా అమ్మో, వదినో అన్నం పెట్టేవారు తనకి. అంతదాకా ఎందుకూ? ఈ పది రోజులూ అత్తగారే అన్నం వడ్డించింది తనకి. అదంతా మరిచిపోయి, బళ్ళోంచి వచ్చిన పదేళ్ళ ఆడబిడ్డకి అన్నం పెట్టడానికి బద్ధకించి "నువ్వే పెట్టుకో, అన్నం కూడా పెట్టుకోలేవా?" అన్నదంటే, .... ఎంత తప్పు చేసింది తను!

కమల నిజంగా సిగ్గుపడిపోయింది. తన బద్ధకాన్ని తిట్టుకుంది. ఏ పనీ చటుక్కున లేచి చేసే అలవాటు లేదయ్యే. పుట్టింట్లో జరిగినట్టు అత్తింట్లో సాగ దంటారు, ఇదే కాబోలు.

అత్తగారు ఏమీ జరగనట్టు కలివిడిగానే పలకరి స్తోన్నా, కమలే అత్తగారి మొహంలోకి చూడలేక పోయింది.

మధ్యాన్నం తనేలేచి కుంపటి అంటించి కాఫీ నీళ్ళు పెట్టింది. అంతవరకూ బాగానే చేతనైంది.

అత్తగారు కాఫీ గ్లాసు అందుకుంటూ "చేటలో కాసిన్ని బియ్యం తీసుకురా అమ్మాయ్! ఏరుతాను" అంటూ గడపలో చతికిలబడింది.

అంతలో రాధ "అమ్మా! అమ్మా!" అంటూ వీధి చీడీలమీద నిలబడి అరిచింది.

"ఏవిటే? రా లోపలికి. నువ్వు బళ్ళోకి వెళ్ళలేదా?"

"సావిత్రి పిన్నికి ఒంట్లో బాగాలేదంట. నిన్నోసారి గమ్మున పిల్చుకు రమ్మంది. నే పోతున్నానోయ్!" అంటూ తూనీగలా ఎగిరిపోయింది రాధ.

"అయ్యో! సావిత్రికి బాగా లేకపోవటం ఏమిటి? ఎనిమిదో నెలే అందిగా మొన్న? నెప్పులొస్తున్నాయా ఏమిటి ఖర్మ! ఏ కబురూ సరిగ్గా చెప్పకుండానే పరి గెత్తిందే ఈ పిల్ల!" అనుకుంటూ అత్తగారు కంగారు పడడం చూస్తూనే వుంది కమల.

"కమలా! నేనోసారి సావిత్రిని చూసి వస్తానేమ్మా! ఒక్కతీ ఏం కంగారుపడుతోందో! ఉత్త మనిషి కాదు."

కమల వింటూ నిలబడింది.

"తవ్వెడు బియ్యం వార్చి, రెండు దోసకాయలు పచ్చడి చెయ్యి. పొద్దుటి పప్పుచారుందిలే, సరి పోతుంది. ఏమన్నా కావాలంటే నేనొచ్చి చూస్తాను. చీకటి పడకుండా వచ్చేస్తాలే .... రాధ కనిపిస్తే పంపి స్తాను. సాయంగా వుంటుంది" అంటూ అత్తగారు రోడ్డు ఎక్కేంతవరకూ మాట్లాడుతూనే వెళ్ళింది.

కమల కర్రబొమ్మలా నిలబడిపోయింది చాలా సేపు. ఏం చెయ్యాలిప్పుడు? అన్నం వండాలా? దోస కాయ పచ్చడి చెయ్యాలా? తనకి ఏ పనీ రాదని అత్తగారికి తెలీదు.

ఏమీ పాలుపోలేదు కమలకి. నీరసంగా నడిచి వెళ్ళి వీధి తలుపులు వేసి వచ్చింది. కుంపటిలో బొగ్గులు నీళ్ళు కారుతోంటే విసనకర్ర అందుకుని విసురుతూ కూర్చుంది. బొగ్గులు కాస్త కణకణలాడు తోంటే, 'ఎసరు పడెయ్యాలి ముందు' అనుకుంది. తీరా గిన్నెలు తియ్యబోతే, ఎసరు ఏ గిన్నితో పెట్టాలో అర్థంకాలేదు. ఎలాగో అన్నం గిన్నిని పోల్చి పట్టుకుంది. అందులో ఎన్ని నీళ్ళు పొయ్యాలో అర్థంకాలేదు. గిన్ని నిండా నీళ్ళు పెట్టి కుంపట్లో పడేసింది.

దోసకాయలూ కత్తి పీటా దగ్గిర పెట్టుకుంది. దోస కాయలు చెక్కడం బొత్తిగా చేతకాలేదు. ఎలాగ ఇప్పుడు? .... అన్నం ఒక్కటీ వొండి వూరుకుంటే? అమ్మో, అత్తగారేమన్నా అనదూ? అసలు రాత్రి అన్నాల్లోకి ఎలాగ? .... పోనీ, దోసకాయల్ని చెక్క కుండా కోసేస్తే? అమ్మో, అత్తాగారేమన్నా అనదూ? అయినా చెక్కులతో తినడానికేం బాగుంటుంది?

ఎసరు మరిగిమరిగి మూత ఎగిరెగిరి పడుతోంటే కుంపటికేసి చూసింది. బియ్యం కడిగి వెయ్యాలి కాబోలు! బియ్యం ఆదరాబాదరా కడిగి, కడుగుతూ ఓ గుప్పెడు బియ్య కిందపోసి, ఎసరు గిన్నెమీద

మూత తీసింది. గుప్పుమని మొహంమీదికి లేచిన ఆవిరికి భయపడి చేతిలో గుప్పెడు బియ్యం కుంపట్లో పోసింది. బొగ్గలు చుఁయ్ చుఁయ్‌మని ఆరిపోతోంటే గబగబా విసురుతూ కూర్చుంది. కాస్సేపటికి అన్నం కుతకుత లాడుతోంటే వార్చబోయింది. ఆవిరి వేడికి వేళ్ళు భగ్గుమనగానే 'అమ్మో' అంటూ అన్నం గిన్ని కింద కుదేసింది. గంజి చింది కుడి కాలిమీద పడి బుడగలా బొబ్బలేచింది. కళ్ళనీళ్ళ పర్యంతమైంది కమలకి. అన్నం వార్చనే లేదు. చేతకాలేదు. దోస కాయలు చెక్కనే లేదు. కుంపటి చప్పగా చల్లారి పోయింది. పైగా కాలొకటి భగభగా మంట! — అత్తగారు వచ్చేటప్పటికి అదీ అవతారం!

ఆవిడ, రాగానే మొదట వంటింట్లో గందరగోళం చూసి తెల్లబోయింది. కోడలి కాలిమీద బొబ్బలు చూసి కంగారుపడింది. కోడలు కాలికి వెన్నరాసి కట్టుకట్టి కూర్చోబెట్టింది. ఒక్కమాట కూడా అనకుండా వంటంతా చేసింది.

కమల సిగ్గుతో చితికిపోయింది. అత్తగారు కేక లేసినా బాగుండుననుకుంది.

ఆ కాలునెప్పి తగ్గడానికి వారం రోజులు పట్టింది. ఆ వారం రోజులూ కమల ఎంత తంటాలుపడ్డా ఒక్క పనీ చెయ్యలేకపోయింది.

తన పరిస్థితి ఎలా వుందో కమలకి అప్పటికి బాగా అర్థమైంది. అత్తగారు మంచిది కాబట్టి సరిపోతోంది గానీ, లేకపోతే తను ఏ మొహంపెట్టుకుని తిరగ గలదు?

వదిన ఎన్నో విధాల చెప్పేది. పనుల్లో తనకి సాయం చెయ్యమని పిలిచేది. తను వింటేనా? అమ్మ విననిస్తేనా? తన గురించి అమ్మ, వదినతో పోట్లాట లకు కూడా దిగేది.

"దాన్ని చదువుకోనియ్యి! చదువుకునే పిల్లని పనుల్లోకి పిలుస్తావెందుకూ? నువ్వూ నేనూ చేస్తున్నాం, చాలు! అది కూడా ఎందుకూ?" అనేది అమ్మ.

వదిన శాంతంగానే వుంటుంది ఎప్పుడూ. "చదువుకోవద్దని నేనంటానా? పనులు నేర్చుకోకపోతే రేపు తనే యాతన పడుతుంది" అనేది.

"దాని సంసారం దానినెత్తిమీద పడితే, అన్నీ అప్పుడే వస్తాయి. కూడూ కూరా ఉడకేసుకోడం పెద్ద బ్రహ్మవిద్యా?" అని అమ్మ, వదిన మాటలు తోసి పారేసేది.

అమ్మకూడా అన్ని పనులూ చేస్తుందిగానీ, తను ఏ పనిలోనన్నా వేలుపెడితే, వదినకి సాయంచేస్తే, అమ్మకు నచ్చదు.

వదిన ఎన్నిసార్లో చెప్పేది. బీరకాయలు చెక్క మనేది. ఉల్లిపాయలు వలవమనేది. మినప్పప్పు రుబ్బ మనేది. ఏదో ఒక పని చెపుతూనే వుండేది.

అమ్మ పడనిస్తేనా? తనకి ఒళ్ళొంగితేనా? "అమ్మో! బీరకాయలు చెక్కాలా? నా వేళ్ళు తెగు తాయి. ఉల్లిపాయలు వలవాలా? నా కళ్ళు మండు తాయి. గోళ్ళు నల్లబడిపోతాయి. మొహం కంది పోతుంది" అనేది తను నవ్వు లాటలోపెట్టి.

"అలాగా? పప్పుచారులో ఉల్లిపాయలు గరిటె లతో ఏరుకుని తింటావు. ఈ దర్జా అంతా ఇక్కడ కాదు, వెళ్ళిన చోట వెళ్ళబొయ్యాలి" అనేది వదిన

"ఆఁ, నాకెప్పుడూ ఇలాగే జరుగుతుంది" అనేది తను బడాయిగా.

చెప్పాలంటే, తనకి అలాగే జరుగుతోంది. అత్త గారు పన్నెత్తు మాట అనదు. పైకి అనకపోయినా, 'ఈ కోడలికి పనీ పాటా రాదు' అని ఆవిడికి కడుపులో బాధగా వుండదా?

వదిన కూడా పైకి ఏమీ అనేదికాదు. కానీ, ఎంత మంచి వాళ్ళకైనా కష్టం వేస్తే కోపం రాదా?

"వదినా! నేనివ్వాళ కాలేజీకి తొందరగా వెళ్ళాలి. వంట కొంచెం తొందరగా చెయ్యి" అంటే, "నాకేం నాలుగు చేతులున్నాయా? అయినప్పటికే అవు తుంది" అనేది కోపం వచ్చి.

అలాంటప్పుడు అమ్మ కలగజేసుకుని — "ఎందుకమ్మా అంత రుసరుసలూ? అది పని చెయ్య లేదనేగా? ఇప్పటినించీ ఎందుకు దానికీ బాదరబందీ? వెళ్ళవే కమలా! వెళ్ళి చదువుకో! ఆ పనేదో నేను చూస్తాలే" అనేది.

"ఎప్పుడూ చెయ్యకపోతే ఇంకెప్పుడు నేర్చు కుంటుందీ?" అని వదిన అంటే,

"ఆఁ, ఇంతోటి అందాల పనీ, నేర్చుకోవాలి ఇప్పటినించీ!" అని అమ్మ ఈసడించేది.

అత్తగారి ఈసడింపులూ వెటకారాలూ అలవాటై

పోయిన వదిన 'మాటకి మాట తెగులు, నీటికి నాచు తెగులు' అనుకునేదో ఏమో, ఇక జవాబు చెప్పేది కాదు. ఊరుకునేది.

నిజంగా, వదిన ఎంత చెప్పింది! ఎంత చెప్పింది! వదిన వెనకాల తను గోరెడు పని నేర్చుకున్నా, ఇవ్వాళ ఇంత బాధ తప్పేది.

కమలకి కోపం ముంచుకు వచ్చింది. తల్లిమీద! ఛీ! తను ఇంత చేతకాని దానిలాగా తయారవడానికి కారణం అమ్మే! అమ్మే! ఇక్కడ చెంబు తీసి అక్కడ పెట్టక్కర్లేనంత గారాబం చేసింది.

మంచీ చెడ్డానేర్పని ప్రేమ ఏం ప్రేమ?

★ ★ ★

"వదినా! నీ కొచ్చిన పనులన్నీ నాకు నేర్పెయ్యి! ఒక నెల్లాళ్ళలో నిన్ను మించి పోవాలి నేను. ఈ పూట నించీ నువ్వు చెప్పినట్టే నేర్చుకుంటాను" అంది కమల అత్తారింటినించి వచ్చీరాగానే.

అక్కడేం జరిగిందో అంతా చెప్పుకొచ్చింది.

వదిన ఆశ్చర్యపోయింది. "అంతబెంగ పెట్టు కున్నావా పనులు రావని? కాస్త శ్రద్ధగా చేసుకుంటే ఎంతసేపు కమలా? వారం పది రోజుల్లో అన్నీ వస్తాయి. నాలుగు రోజులు పోనియ్యి, నేర్చుకుందువు గాని. నీకు పకోడీలు ఇష్టమని సెనగపప్పు నాన బెట్టాను. నేను రుబ్బుకోవాలి. నువ్వు ఏదన్నా పుస్తకం చదువుకో" అంటూ లేచింది వదిన.

"పని వుంటే ఇప్పుడేం చదువు? పప్పు నేనే రుబ్బు తాను. పకోడీలు కూడా నేనే చేస్తాను. ఎలా చెయ్యాలో నువ్వు చెపుతూ వుండు" అని వదినగారి వెంటపడింది కమల.

"చాల్లే, ఊరుకో! ఈ పూటనించేనా? అంత కంగా రేవిటి? మీ అత్తగారు నిన్ను బాగా హడలగొట్టి నట్టుందే!"

"ఛా, పాపం! ఆవిడ నన్ను ఒక్కమాట అనలేదు. అందుకే నాకు మరీ సిగ్గుగా వుంది" అంటూ రోటి ముందు కూర్చుని పప్పు రుబ్బే పని మొదలు పెట్టే సింది కమల.

నిద్ర లేచి వచ్చిన తల్లి, కమల్ని రోటి దగ్గిర చూసి కోడలి మీద రుసరుసలు మొదలుపెట్టింది. "అదేవిటే రాజేశ్వరీ! అది బండి దిగి వచ్చి ఒక్క పూటైనా అయిందో లేదో దానికి పని అప్పజెప్పావు. నువ్వు రుబ్బుకోకూడదూ?"

"తనే రుబ్బుతానని పట్టుబట్టి కూర్చుంది. నేను వొద్దనే అన్నాను."

"ఆఁ, అన్నావు! ఏదో అన్నావు, పైపై మాట! అది ఎలాగూ అక్కడ చేసుకోవొద్దూ? పుట్టింట్లోకూడా అది చాకిరీ చెయ్యాలా?"

తల్లి మాటలకి కమలకి చాలా చిరాకేసింది. "అమ్మా! నేనే రుబ్బుతానన్నాను. అనవసరంగా వదిన్ని అనకు!"

"బాగానే వెనకేసుకొస్తావులే వదిన గార్ని."

"వెనకా లేదు, ముందూ లేదు. నీ మాటలు వినే నేనిలా తయ్యారయ్యాను. ఒక్కపనీ రాక మా అత్తగారి దగ్గిర సిగ్గుతో ఛస్తున్నాను."

"అంత సిగ్గుతో చచ్చేపని నువ్వేం చేశావనీ? అందరూ పుట్టగానే నేర్చుకుంటారా? నిన్న మొన్నటి దాకా చదువేనయ్యే! పనులకేం భాగ్యం, నాలుగేళ్ళు పోతే అవే వస్తాయి."

"ఆ నాలుగేళ్ళూ ఎవడు చేస్తాడు నా తాత? ఎవడి మీదపడి తింటాను నాలుగేళ్ళ దాకా?"

"ఏం, మీ అత్తగారేం చేస్తుందీ? కోడలు వొచ్చీ రాగానే వంటలూ వార్పులూ చెయ్యాలా ఆవిడికి? నిన్నేవన్నా అంటే గట్టిగా చెప్పు. 'చదువుకున్న దాన్ని, నాకీ పనులన్నీ రావు' అని చెప్పు! ఆవిడే నోరుమూసు కుంటుంది."

కమలకి చాలా కోపం వొచ్చింది తల్లిమీద. "చాల్లే, ఊరుకో, నీ కోడలు నీ దగ్గిర అణిగీ మణిగీ ఉండాలి. నీ కూతురైతే, అత్తకీ ఎదురుతిరగాలా? మతిలేని మాటలు! నువ్వసలు ఈ పూటనించీ వదిన్నే మన్నా అన్నావంటే ఊరుకోను. కోడలనగానే సాధిం చాలని బుద్ధిపుడుతుందా యేవిటి నీకు? ఎంత పని చేస్తొన్నా ఏదో ఒకటి అంటూనే వుంటావు. ఏ పనీ చేతగాని నాలాంటి దాన్నయితే ఏం చేసే దానివో! మా అత్తగార్ని చూశాకే నా కిదంతా తెలిసొచ్చింది" అంటూ రుబ్బిన పిండి గిన్నిలోకి తీసుకుని లేచింది కమల.

తల్లి తెల్ల మొహం వేసింది.

[1963 ఆగస్టు, 'నెల వంక' మాస పత్రికలో] ★